సాక్షి
మెదక్
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



విద్యార్థులకు అల్పాహారం

ఉదయం పస్తులతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేసింది.

వివరాలు 8లో ▸



సిత్యా తండాలో చిరుత కలకలం

శివ్వంపేట మండల పరిధి బిక్యా పంచాయతీ పరిధిలోని సిత్యా తండాలో చిరుత సంచారం కలకలం రేపుతోంది.

వివరాలు 8లో ▸




డ్రైనేజీ అస్తవ్యస్తం

పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగునీరు ఇళ్ల మధ్యన పారుతుంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.

వివరాలు 9లో ▸

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

89855 54525

న్యూస్‌రీల్

ప్రభుత్వం చర్చలు జరపాలి



మాట్లాడుతున్న బస్వరాజ్

మెదక్ కలెక్టరేట్: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగన్‌వాడీలతో చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో అంగన్‌వాడీలకు మద్దతుగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్ట్ 18న చర్చలు జరిపిన మంత్రి పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించలేదన్నారు. కేంద్రానికి సంబంధం లేకుండా రాష్ట్రాలు అంగన్‌వాడీ ఉద్యోగులకు అన్ని వసతులు కల్పిస్తున్నాయని, తెలంగాణాలో కూడా వీటిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నందం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఐద్వా నాయకులు గీత, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకట్

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వెంకట్ సూచించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని గాంధీనగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు వీధుల్లో కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆన్‌లైన్ లావాదేవిల సమయంలో జాగ్రత్తగా ఉండాలని, బ్యాంకు వివరాలను ఎవరితో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పోచయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

శివ్వంపేట(నర్సాపూర్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం శివ్వంపేటలో దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 14 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. ఐసీడీఎస్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.




పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయం ఆదివారం జనారణ్యంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలో స్నానాలు ఆచరించి దుర్గమ్మను దర్శించుకున్నారు. పూజారులు శంకరశర్మ, పార్థివశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దుర్గమ్మ తల్లికి ఒడి బియ్యం పోసి, బోనాలు తీశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ చర్యలు తీసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లింగన్నపేట గ్రామానికి చెందిన కొడుమూరి సత్యనారాయణ ఏడుపాయల దుర్గమ్మకు యూఏఈ దేశ కరెన్సీ 1,620 (రూ.36,660) దినార్‌లను బహూకరించారు.

బరిలో నిలిచేదెవరో?

నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించని ప్రధాన పార్టీలు

- టికెట్ తమదేనంటూ ఆశావహుల ప్రచారం
- అయోమయంలో ఆయా పార్టీల కేడర్



మెదక్: శాసన సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నర్సాపూర్ నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థిని ప్రకటించలేదు. అందరికన్నా ముందుగా అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ కూడా నర్సాపూర్‌ను పెండింగ్‌లో పెట్టింది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలు కూడా అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో నర్సాపూర్ అభ్యర్థి విషయంలో అయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అయోమయానికి గురవుతున్నారు.

బీఆర్ఎస్‌లో గందరగోళం..

రాష్ట్రంలోని 115 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించిన గులాబీ బాస్ నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో కేడర్‌లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నర్సాపూర్ నుంచి మరోసారి బరిలోకి దిగాలని ఉవ్విళ్లూరుతున్నారు. కానీ బీఆర్ఎస్ అధిష్టానం మాత్రం మదన్‌రెడ్డిని తప్పించి మాజీ మంత్రి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డికి టిక్కెట్ ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు మదన్‌రెడ్డి తగ్గేదిలేదంటూ నెల రోజులుగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అనుచరులతో కలిసి మంత్రి హరీశ్‌రావు ఇంటి ఎదుట ధర్నా చేసిన ఆయన గత నెలలో మెదక్‌లో జరిగిన సీఎం సభలో ఫ్లెక్సీలను ప్రదర్శించి కేసీఆర్ దృష్టిలో పడే ప్రయత్నం చేశారు. నర్సాపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించి బల ప్రదర్శన చేయడంతో పాటు ఎన్నికల బరిలో ఉంటానని పలు సందర్భాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పార్టీ పెద్దల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో మదన్ రెడ్డి అనుచరులు డీలా పడుతున్నారు. నర్సాపూర్ టిక్కెట్ ఆశిస్తున్న సునీతారెడ్డి అనుచరులు ఈ సారి తమకే టిక్కెట్ అని, సునీతమ్మ పేరును ప్రకటించడమే ఆలస్యమంటూ ఆమె అనుచరులు చెబుతున్నారు. ఎవరో ఒకరి పేరును అధిష్టానం ప్రకటిస్తే తప్ప గందరగోళానికి తెరపడే అవకాశం కనబడడంలేదు.

తేలని హస్తం అభ్యర్థి..

ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించలేదు. నియోజకవర్గంలో ముగ్గురి పేర్లను ఎంపిక చేసి దరఖాస్తులను పరిశీలనకు ఢిల్లీకి పంపించారు. స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల వడపోత పూర్తి చేసినట్లు సమాచారం. అధికారికంగా అభ్యర్థుల జాబితాను ప్రకటించడమే మిగిలింది. కాగా నర్సాపూర్ కాంగ్రెస్ టికెట్ కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ ప్రధాకార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, రవీందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నా.. కేడర్‌కు మాత్రం సరైన ధీమా ఇవ్వలేకపోతున్నారు. త

కమలంలోనూ అదే పరిస్థితి..

నర్సాపూర్ నుంచి పోటీ కోసం బీజేపీ అభ్యర్థులు పలువురు టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్ గౌడ్, రఘువీర్ రెడ్డి, పాపగారి రమేశ్ ఉన్నారు. బీజేపీ అధిష్టానం ఎవరిని ఖరారు చేయలేదు. దీంతో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేసుకుందామంటే టిక్కెట్ ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొద్దో గొప్పో ఉన్న కేడర్‌ను కాపాడుకునేందుకు నాయకులు తంటాలు పడుతున్నారు. మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తేనే నర్సాపూర్‌లో ఎన్నికల కోలాహలం మొదలవుతుంది.

మల్లన్న ముంగిట పట్నం సందడి



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. మమ్మేలు మల్లన్నస్వామి అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అభిషేకాలు, పట్నాలు, ప్రత్యేకపూజలు చేశారు. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. పట్నాల టికెట్ కౌంటర్లలోని ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపించారు.



పట్నం వద్ద భక్తుల పూజలు

సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉంది

అనుచరులతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అనుచరులకు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ బీఆర్ఎస్ నాయకుని ఇంటిలో ముఖ్య అనుచరులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్యాక్స్ చైర్మన్లతో సమావేశమైనట్లు తెలిసింది. రానున్న ఎన్నికలకు నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిని బీఆర్ఎస్ అధినాయకత్వం ఇంకా ప్రకటించకపోవడంపై పలువురు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. మదన్‌రెడ్డికి టికెట్ రాని పక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని కొంత మంది ప్రతిపాదించగా.. అలా చేస్తే ప్రయోజనం ఉండదని మెజారిటీ నాయకులు చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరి ఎన్నికల బరిలో ఉండాలని పలువురు సూచించినట్లు సమాచారం. ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిసి నర్సాపూర్ టికెట్‌ను మదన్‌రెడ్డికి ఇవ్వాలని కోరుతామని ఓ నాయకుడు అనగా, అపాయింట్‌మెంట్ లేకుండా ప్రగతి భవన్‌కు వెళ్లలేమని, తొందరపాటుగా మాట్లాడొద్దని ఎమ్మెల్యే హితవు పలికినట్లు తెలిసింది. సీఎం కేసీఆర్‌పై తనకునమ్మకం ఉందని, టికెట్ విషయంలో అన్యాయం చేయరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, బహిరంగ ప్రకటనలు చేయొద్దని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని చెప్పినట్లు తెలిసింది.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యమేదీ?

శివ్వంపేట(నర్సాపూర్): జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు చట్ట సభల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపేట, గుండ్లపల్లిలో ఆ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్యతో కలసి ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడం సిగ్గు చేటని, ముదిరాజ్‌లు బలంగా ఉన్న చోట్ల స్వతంత్రంగా పోటీ చేసి సత్తా చూపాలన్నారు. బీసీ డీ నుంచి ఏలోకి మార్చేలా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు బాబురావు, నర్సింలు, తోట సంజయ్, పిట్ల సత్యనారాయణ, కుమార్, మధు, మురళీధర్, ఉదయ్ తదితరులు ఉన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): గౌడకులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాజ్‌పేట ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఈతవనంలో మొక్కలు నాటారు. తాటి, ఈత మొక్కల పెంపకంతో గౌడ కులస్తులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం రూ.5లక్షల సీడీపీ నిధులతో చేపట్టనున్న గౌడ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, సర్పంచ్‌లు సరిత, యామిరెడ్డి, కిషన్ నాయక్, ఎంపీటీసీలు స్వప్న, జ్యోతి, జాగృతి జిల్లా అధ్యక్షులు రమేశ్‌గౌడ్, బాబాగౌడ్, జైపాల్‌గౌడ్, సర్వేయర్ రమేశ్‌గౌడ్, సిద్దాగౌడ్ పాల్గొన్నారు.



ఈత మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

విఘ్నేశ్వరునికి పూజలు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని శాంతినగర్, వాసవినగర్ కాలనీల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మెదక్ చర్చిలో సీనియర్ సిటిజన్ వేడుకలు



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మెదక్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ డే జరిపారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్‌లకు చర్చి నిర్వాహకులు రోజా పువ్వులు ఇచ్చి సన్మానించారు. ఉదయం 10 గంటలకు మతగురువు రాబిన్‌సన్, మధ్యాహ్నం చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జ్ శాంతయ్య సందేశం అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- కొత్తమండలాల్లో అభివృద్ధి శూన్యం
- నిధులున్నా.. పనులు ఆలస్యం
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మెదక్: ప్రతీ మూడు నెలలకోసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్నా.. సమస్యలకు పరిష్కారం చూపటం లేదనే విమర్శలు ఉన్నాయి. 2016లో హవేళీఘనాపూర్, నిజాంపేట, నార్సింగ్, మనోహరాబాద్, మాసాయిపేట, చిలప్‌చెడ్ మండలాలు ఏర్పాటయ్యాయి. ఏడేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు పరిష్కారం చూపకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి.

అద్దె భవనాల్లో కార్యాలయాలు..

నిజాంపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఓ పెంకుటింట్లో కొనసాగుతోంది. వర్షం కురిసినప్పుడు రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. పోలీస్‌స్టేషన్ కూడా అద్దె భవనంలో ఉండడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. నిజాంపేట మండల కేంద్రం నుంచి నస్కల్ వరకు బీటీరోడ్డు కోసం మూడేళ్ల క్రితం రూ.12 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ వేసేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపడంలేదు. వెల్దుర్తి మండల కేంద్రం నుంచి శివ్వంపేట మండలాన్ని కలిపే రోడ్డు ఉసిర్కపల్లి, చండి, గుమ్మడిదల గోమారం తార్ రోడ్డు వర్షానికి దెబ్బతిన్నది. మరమ్మతు కోసం రూ.18 కోట్లు మంజూరైనా.. పనులు ప్రారంభించలేదు. కొల్చారం మండలంలోని అంసాన్‌పల్లి రోడ్డు 4కిలోమీటర్ల మేర పాడైన రోడ్డు మరమ్మతుకు రూ.1.50 కోట్లు విడుదల చేశారు. ఏడుసార్లు టెండర్ వేయగా ఇటీవల ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. చిన్నశంకరంపేట మండల కేంద్రం నుంచి జంగారాయికి వెళ్లే రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. హవేళిఘనాపూర్ మండలం దూప్‌సింగ్ తండా రోడ్డులో గంగమ్మవాగుపై బ్రిడ్జి వరదలకు కొట్టుకుపోయింది. నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనా.. పనులు జరగటంలేదు. గ్రామీణులకు వైద్యం అందించేందుకు మూడేళ్ల క్రితం 117 పల్లె దవాఖానాలను ప్రభుత్వం కేటాయించింది. ఒక్కోదానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకు 16 మాత్రమే పూర్తవగా, ఇందులో 11 దవాఖానాలను ప్రారంభించారు. 98 చోట్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మరో 19చోట్ల నేటికి టెండర్ పూర్తికాలేదు. జిల్లాకు 4,776 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరవగా 3,779 ఇళ్లకు టెండర్ పూర్తయింది. ఇందులో 3,644 ఇళ్లను ప్రారంభించారు. 1,204 ఇళ్ల పనులు ఆగిపోయాయి. నేడు జరుగనున్న జెడ్పీ సమావేశంలోనైనా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా లేదా అనేది వేచిచూడాలి.

మూడేళ్లుగా ముందుకు కదలక

- కలగానే 'డబుల్' ఇళ్ల నిర్మాణం
- శిలాఫలకానికే పరిమితమైన వైనం
- అర్హులకు తప్పని ఎదురుచూపు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన కుంట స్థలం ఇదే

రామాయంపేట(మెదక్): అర్హులైన పేదలకు అన్ని సౌకర్యాలతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో అద్దె ఇళ్లు, పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న నిరుపేదలు తమకు మంచి రోజులు వచ్చాయని సంబరపడ్డారు. నార్సింగి మండల కేంద్రంలో రెండు పడకల ఇళ్ల నిర్మాణానికి మూడేళ్ల క్రితం మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసినా.. ఇంతవరకు పనులు షురూ కాలేదు. కేటాయించిన నిధులను ఇతర కార్యక్రమాలకు తరలించడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.

నార్సింగి మండల కేంద్రంలో రూ.3కోట్లతో చేపట్టిన 60 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి 2020 సెప్టెంబర్ 16న మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన కుంట స్థలాన్ని ఎంపిక చేశారు. ఆర్భాటంగా శంకుస్థాపన చేసినా.. నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. మంజూరైన నిధులను ఇతర పనులకు కేటాయించడంతో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మండలంలోని గ్రామాల్లో ఇళ్లు లేని కుటుంబాలు సుమారు 350 వరకు ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఆలస్యం కావడంతో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నవారికి కూడా ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదని వాపోతున్నారు.

గుడిసెలో ఉంటున్నా



డబుల్ బెడ్ రూం ఇల్లు రాకపోవడంతో పూరి గుడిసెలో కవర్ కప్పుకొని ఉంటున్నా. ఆర్థికంగా స్థోమత లేక గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– లాలి, సంకాపూర్ తండా


త్వరగా అందించాలి



కుటుంబంతో కలిసి శిథిలమైన గుడిసెలో ఉంటున్నాం. మూడేళ్లుగా ఇంటి కోసం ఎదురు చూస్తున్నాం. నిరుపేదలమైన మాకు ప్రభు త్వం గృహాలు నిర్మించి అందించాలి.

– కంద్లకోయ సుశీల, నార్సింగి

అర్హులందరికీ ఇస్తాం



డబుల్ బెడ్ రూం రాని వారికి గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేస్తాం. ఇప్పటికే చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులందరికీ ఇళ్లు అందేలా చూస్తాం.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ, మెదక్

క్లుప్తంగా

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

జహీరాబాద్‌ టౌన్‌: డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. సెలవు రోజు అయినప్పటికీ సమ్మెలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలను పర్మినెంట్‌ చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మెలో యూనియన్‌ నాయకులు సుశీలమ్మ, అనురాధ, సబిత, షాహిదా, వసీమా, బాలమణి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



దొంగను పట్టుకున్న గ్రామస్తులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్తున్న ఓ దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన జగదేవ్‌పూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా ఓ ఇంటి సమీపంలో పాప సెల్‌ఫోన్‌తో ఆడుకుంటుంది. గమనించిన దొంగ.. ఎవరూ చూడని సమయంలో పాప చేతిలో నుంచి సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరుగెత్తాడు. స్థానికులు విషయాన్ని గ్రహించి దొంగను వెంబడించి పట్టుకున్నారు. అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి మహిళకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మంజుల

కౌల్దారం(నర్సాపూర్‌): గోడ కూలి మీద పడడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పైతర గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాడబోయిన నగేష్‌, మంజుల దంపతులు ఇనుప రేకులతో కూడిన ఓ చిన్న గదిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున వారు నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు గోడకూలి మంజులపై పడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో మెదక్‌ ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీకి తరలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడ నాని ఉండటం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

కాశీలో తప్పిపోయిన మహిళ



బోయిని సిద్దవ్వ

రామాయంపేట(మెదక్‌): కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లిన మెదక్‌ జిల్లా రామాయంపేట మండలం పర్వతాపూర్‌ గ్రామానికి చెందిన బోయిని సిద్దవ్వ(50) తప్పిపోయింది. తన భర్తతో కలిసి రామాయంపేటలో నివసించే ఆమె మరి కొంతమందితో కలిసి ఐదు రోజుల క్రితం కాశీ వెళ్లింది. ఆమె అక్కడ తప్పిపోవడంతో వెంట వెళ్లినవారు అంతా గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ విషయం తెలుసుకున్న సిద్దవ్వ కుటుంబ సభ్యులు కాశీకి వెళ్లినట్లు పర్వతాపూర్‌ సర్పంచ్‌ బోయిని దయాలక్ష్మి స్వామి తెలిపారు.

మండల కాంగ్రెస్‌లో విభేదాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండల కాంగ్రెస్‌ పార్టీలో విభేదాలు తలెత్తాయి. ఆదివారం బెజ్జంకి పార్టీ కార్యాలయంలో కరీంనగర్‌ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో సీనియర్‌ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలువురు పేర్కొన్నారు. ఈ విషయంపై యువకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్వల్ప ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో కవ్వంపెల్లి వారిని సముదాయించారు.

విద్యార్థులకు అల్పాహారం

- దసరా నుంచి అమలు
- 89,504 మందికి లబ్ధి



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు(ఫైల్‌)

హుశాంత్‌నగర్‌(సిద్దిపేట): పస్తులతో పాఠశాలల కొచ్చే పేద పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం అందించి ఆదుకోనుంది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం అందిస్తున్నా పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉదయం పాఠశాలలకు పస్తులతో వస్తున్నారని, వారికి పరిపూర్ణ ఆహారం అందించాలని నిర్ణయించుకుంది. పేదరికం.. ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం.. తల్లిదండ్రులకు సహాయం చేయడం.. వివిధ పనుల్లో ఉండడం వంటి కారణాలతో విద్యార్థులు ఉదయం ఆహారం తీసుకోలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆ పస్తులకు స్వస్తి పలుకనుంది.

కిచిడి.. పొంగల్‌... ఉప్మా...

విద్యార్థులకు అల్పాహారంలో కిచిడి, పొంగల్‌, ఉప్మా అందించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట రాగిజావను అందజేస్తున్నారు. దానితో పాటుగా అల్పాహారం అందించడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుంది. జిల్లాలో 638 ప్రాథమిక, 117 ప్రాథమికోన్నత, 227 ప్రభుత్వ ఉన్నత, 14 ఆదర్శపాఠశాలలు ఉన్నాయి. అందులో 89,504 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ అక్టోబర్‌ 24 నుంచి దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది.

మంచిగా చదువుకోవచ్చు



ఉదయం పాఠశాలకు వచ్చే హడావుడిలో తినడం సాధ్యమవడంలేదు. మధ్యాహ్న భోజనం వరకు వేచి చూడాల్సి వస్తోంది. పాఠశాలలో అల్పాహారం అందిస్తే, మంచిగా చదువుకునే అవకాశం ఉంది.

–ముత్యం అక్షిత్‌గౌడ్‌, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్‌ కొమురవెల్లి

చిన్నారులకు మంచి..



నాకు ముగ్గురు కుమార్తెలు.. పెద్ద అమ్మాయి మద్దూరు కేజీబీవీలోను, మిగతా ఇద్దరు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. ఇలాంటి పథకాలతో పేద విద్యార్థులకు మంచి జరుగుతుంది.

– నీలం అనిల్‌, లద్నూర్‌

పేద విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకుంటుంటారు. చాలా మంది ఉదయం పూట పస్తులతో వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న ఈ పథకం వల్ల వారికెంతో ఉపయోగం.

– బస్వరాజ్‌కుమార్‌ (ఉపాధ్యాయుడు), ప్రాథమిక పాఠశాల, చాట్లపల్లి

కరాటే పోటీల్లో ఖేడ్‌ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నారాయణఖేడ్‌: సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి షాటేఖాన్‌ కరాటే పోటీల్లో నారాయణఖేడ్‌ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్‌ ప్రశాంత్‌ తెలిపారు. నిత్యశ్రీ, వీర షాష్విక్‌, కార్తీక్‌, శ్రీరాం ప్రథమ బహుమతులు, రాజేష్‌, చెర్రీ ద్వితీయ బహుమతులు, సాత్విక్‌ తృతీయ బహుమతులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌ను జిల్లా పీఈటీల అసోసియేషన్‌ అధ్యక్షులు మారుతి, ఖేడ్‌ షటిల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అబ్దుల్‌ సాజిద్‌ అభినందించారు.

క్రీడా హబ్‌గా సిద్దిపేట



ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటజోన్‌: క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు పేరు తీసుకురావాలని సిద్దిపేట స్పోర్ట్స్‌ క్లబ్‌ కన్వీనర్‌ సాయిరాం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 56 అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట క్రీడా హబ్‌గా మారిందన్నారు. క్రీడాకారులు వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన 30మందిని ఎంపిక చేశారు. వీరు ఈ నెల 30న కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే..

సిద్దిపేటజోన్‌: ఆత్మ రక్షణతోపాటు శారీరక దృఢత్వానికి కరాటే దోహదపడుతుందని డీఎస్‌ఓ నాగేందర్‌ అన్నారు. ఆదివారం స్థానిక కొండ భూదేవి గార్డెన్స్‌లో జపాన్‌ కరాటే అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 37వ జాతీయ స్థాయి టీహెచ్‌ఆర్‌ కప్‌ 2023 పోటీలు నిర్వహించారు. ఇందులో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కటాస్‌, వేపన్‌, స్పైరింగ్‌ విభాగంలో అండర్‌ 11 నుంచి 18 పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు సుదర్శన్‌, ఆంజనేయులు, భాగ్యరాజ్‌ పాల్గొన్నారు.

బైక్‌ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకులు

శివ్వంపేట(నర్సాపూర్‌): బైక్‌ పై వెళ్తున్న వారిని గేదె ఢీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన ఉమాపతిరాజు, మరేందర్‌రెడ్డి ఫైబర్‌ నెట్‌ కెబుల్‌ పని నిమిత్తం తూప్రాన్‌లో ఉంటున్నారు. ఆదివారం వారు నర్సాపూర్‌లో పనులు ముగించుకుని తూప్రాన్‌కు తమ బైక్‌పై వెళుతుండగా శివ్వంపేట్‌ పోలీస్‌ స్టేషన్‌ దగ్గరలో వారిని అకస్మాత్తుగా గేదె ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

సిద్దిపేటరూరల్‌: యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నారాయణరావుపేటకు చెందిన జెట్ట అనిల్‌ (19) దేవతల పండగలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం బీబీపేట్‌ మండలంలోని తుజాల్‌పూర్‌కు తన స్నేహితుడితో వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అయితే ఆదివారం అనిల్‌ తండ్రి బర్రెపాలు పిండటానికి పాత ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న వేప చెట్టుకు అనిల్‌ ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించాడు. కొద్ది రోజుల క్రితం తన కొడుకును కొందరు వ్యక్తులు చంపుతానని బెదిరించారని ఫిర్యాదులో అనిల్‌ తండ్రి నర్సింహులు పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో..



శ్రీశైలం (ఫైల్‌)

బషీరాబాద్‌: ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన బషీరాబాద్‌ మండలం మంతట్టి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి భీమప్ప కొడుకు తలారి శ్రీశైలం(26) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం బొంరాస్‌పేట మండలం వడిచర్ల గ్రామంలో తన స్నేహితుడి బంధువుల అంత్యక్రియలకు కారు నడపడానికి వెళ్లాడు. అక్కడ వెళ్లాక అస్వస్థతకు గురయ్యాడు. సాయంత్రం అదే కారులో స్టీరింగ్‌ సీటులోనే ప్రాణాలు వదిలాడు. కిరాయి తీసుకెళ్లిన గ్రామస్తులు వచ్చి చూసే సరికి స్పృహలో లేకపోవడంతో స్థానిక వైద్యుడికి చూపించారు. పరీక్షించిన వైద్యుడు గుండె పోటుతో చనిపోయినట్లు నిర్ధారించాడు. ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. భాగ్యశ్రీని రెండేళ్ల కిందట శ్రీశైలం ప్రేమవివాహం చేసుకున్నాడు.

70గ్రాముల ఆల్ఫాజోమ్‌ పట్టివేత

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మెదక్‌ మండలం మంభోజిపల్లి కల్లు దుకాణంలో ఆల్ఫాజోమ్‌ మత్తు పదార్థాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు మెదక్‌ రూరల్‌ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కౌల్దారం మండలం ఎనగండ్ల గ్రామానికి చెందిన కృష్ణాగౌడ్‌ మంభోజిపల్లి గ్రామ కల్లు దుకాణంలో ఆల్ఫాజోమ్‌ మత్తు పదార్థాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి 70గ్రాముల ఆల్ఫాజోమ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా మెదక్‌రూరల్‌ ఎస్‌ఐ అమర్‌ అందుబాటులోకి రాలేదు.

మహిళ ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌ టీం, పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్‌): మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని రూప్లా తండా పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మండపల్లి గ్రామానికి చెందిన రిషికేష్‌ కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం కొత్తపేట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చాడు. అతని భార్య సబిత(46) ఈనెల 20న పెద్ద కూతురుతో మాట్లాడేందుకు కొడుకును ఫోన్‌ అడిగింది. ఫోన్‌ ఇవ్వకపోవడంతో తల్లీకొడుకుల మధ్య గొడవ జరిగింది. అదేరోజు బయటకు వెళ్లిన సబిత తిరిగి రాలేదు. శనివారం రాత్రి రూప్లా తండా అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని కుళ్లిన స్థితిలో ఉన్న సబిత మృతదేహం వెలుగులోకి వచ్చింది. ఆదివారం క్లూస్‌ టీం వచ్చి వివరాలు సేకరించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

సిత్యా తండాలో చిరుత కలకలం



ఆందోళన వ్యక్తం చేస్తున్న తండా వాసులు



చిరుత పాదముద్రలు

భయాందోళనలో తండా వాసులు, రైతులు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధి బిక్యా పంచాయతీ పరిధిలోని సిత్యా తండాలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. శనివారం రాత్రి తండాకు చెందిన ఇద్దరు యువకులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీప పొలాల వద్దకు వెళ్లారు. అక్కడ చిరుత శబ్దం వినపడటంతో భయంతో పరిగెత్తుకుంటూ వచ్చారు. 10 రోజుల క్రితం గెమ్‌సింగ్‌ తండా పరిసరాల్లో సంచరించిన చిరుత సిత్యా తండా వైపు వచ్చి ఉండొచ్చని ప్రజలు భావిస్తున్నారు. దీంతో సిత్యా, నాను, బిక్యా, గెమ్‌సింగ్‌, తుక్యా, తాళ్లపల్లితండా వాసులతో పాటు వ్యవసాయ పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతని బంధించాలని ఆయా తండా వాసులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు ప్రయోజనం



ముత్తన్నపేటలో మాట్లాడుతున్న కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్‌ పాలనలోనే పేదలకు ప్రయోజనం చేకూరిందని కరీంనగర్‌ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్‌ ఇంచార్జి కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ముత్తన్నపేటలో ఆదివారం ఆయన పర్యటించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. అనంతరం మహిళా కాంగ్రెస్‌ మండల అధ్యక్షురాలిగా కనగండ్ల జ్యోతిను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీ, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్‌, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణ, రంగోని రాజు, మాంకాలి ప్రవీణ్‌, ముత్తన్నపేట ఉపసర్పంచ్‌ సుధీర్‌రెడ్డి, సత్యం, శ్రీనివాస్‌, సుమన్‌, మహేష్‌, జమీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో దాడి.. ముగ్గురికి గాయాలు

పాపన్నపేట(మెదక్‌): భూ తగాదా కారణంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం మండల పరిధిలోని కొడుపాకలో జరిగినట్లు ఎస్సై మహిపాల్‌ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొడుపాకకు చెందిన కట్టమీది పాపయ్యకు పాలి వారితో భూ తగాదాలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం పాలివారు రమేష్‌, దుర్గేష్‌తోపాటు మరికొందరు కలసి పాపయ్య ఇంటి మీదకు వెళ్లి దూషిస్తూ కర్రలతో దాడి చేశారు. దీంతో పాపయ్య తలకు గాయమైంది. అన్నను కొడుతున్నారని అడ్డంపోయిన పాపయ్య సోదరుడు మాణయ్యకు కూడా గాయాలయ్యాయి. ఈ దాడిలో రమేష్‌ సైతం గాయపడ్డాడు. వారిని ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



సంజీవ మృతదేహం



లోకేష్‌ (ఫైల్‌)

నర్సాపూర్‌రూరల్‌: మండలంలో జరిగిన వివిధ ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. మరో గృహిణి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. నారాయణపూర్‌ గ్రామానికి చెందిన కిష్టని సంజీవ(48) ఆదివారం వ్యవసాయ బావి వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో స్థానికులు కాపాడేలోగా మృతి చెందాడు. అతడి కుమారుడు నవీన్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని...

నర్సాపూర్‌ మండలం ముసాపేటకు చెందిన దేవులపల్లి మల్లేశం కుమారుడు చిన్న లోకేష్‌ (21) వ్యసనాలకు బానిసై తండ్రికి తెలియకుండా అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.15వేలు వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న మల్లేశం లోకేష్‌ను మందలించాడు. దీంతో లోకేష్‌ ఈ నెల 8న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ 23 రాత్రి మృతి చెందినట్లు తండ్రి మల్లేశం తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్‌ పోసుకుని గృహిణి ఆత్మహత్యాయత్నం

సునీత రెడ్డి కాలనీకి చెందిన జేరుపుల మమత(21) ఆదివారం తనపై పెట్రోల్‌ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిరుపయోగంగా పంచాయతీ భవనం

- అద్దె భవనంలోనే కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న పంచాయతీ భవనం

అల్లాదుర్గం(మెదక్‌): సరైన భవనాలు లేక కార్యకలాపాలు నిర్వహించుకోలేని పంచాయతీలు ఎన్నో ఉన్నాయి. కాని లక్షలు ఖర్చుపెట్టి నిర్మించినా నిరుపయోగంగా మిగిలింది.. ఒక పంచాయతీ భవనం.. అధికారులు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇదీ.. ముస్లాపూర్‌ పంచాయతీ భవనం దుస్థితి. మండల పరిధిలోని ముస్లాపూర్‌ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడేళ్ల క్రితం ఎన్‌ఆర్‌ఇజీఎస్‌ పథకం కింద రూ.12 లక్షలు మంజూరు చేసింది ప్రభుత్వం. అయితే నిర్మాణం చేపట్టి శ్లాబ్‌వేసి వదిలివేశారు. నిధులు పరిపోవడం లేదని, బిల్లులు రావడం లేదని అప్పట్లో కాంట్రాక్టర్‌ చేతులెత్తేశాడు. 2021లో పంచాయతీ నిధులతో భవన నిర్మాణం పనులు తిరిగి మొదలు పెట్టారు. రెండేళ్ల తరువాత భవనం పూర్తయింది. మూడు నెలలు గడిచినా అది ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో భవనం నిర్మించినా నిరుపయోగంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సభలు, సమావేశాల నిర్వహణకు ఇబ్బందిగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భవనాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరుతున్నారు.



వినాయకుడి బొమ్మ వేస్తున్న సామిత్‌గాంధీ



సామిత్‌ వేసిన వినాయకుడి బొమ్మ

భళా.. సామిత్‌ చిత్ర కళ!

కల్హేర్‌(నారాయణఖేడ్‌): కల్హేర్‌ మండలం మార్డికు చెందిన సామిత్‌ గాంధీకి పెయింటింగ్‌ వేయడం అంటే చాలా ఇష్టం. బుర్రంశెట్టి హన్మండ్లు స్రవంతి దంపతుల కుమారుడైన సామిత్‌ నాలుగో తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం కేసీఆర్‌, ప్రముఖుల చిత్రపటాలను అద్భుతంగా గీసి పలువురి మన్ననలు పొందాడు. అంతేకాకుండా పండగల సమయంలో దేవతల బొమ్మలు గీస్తుంటాడు. ఆదివారం చిత్రించిన వినాయకుడి బొమ్మను చూసి పలువురు ప్రశంసించారు.